క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ గ్రామానికి చెందిన ఆర్.రేవంత్ కొంతకాలంగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. మెరుగైన వైద్యంకోసం సర్పంచ్ రావుల రమేశ్ మానకొండూర్ ఎమ్మెల్యే డా.రసమయి బాలకిషన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయనిధి నుంచి మెరుగైన వైద్యం అందించేందుకు శుక్రవారం రూ.1,75,000 ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఈమేరకు హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో రేవంత్ కుటుంబసభ్యులకు ఎల్‌వోసీ అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రసమయికి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పౌరహక్కుల దినోత్సవం



సమావేశంలో అధికారులు, ప్రజలు

గంగాధర: మండలంలోని మంగపేట గ్రామంలో పోలీస్, రెవెన్యూ అధికారులు శుక్రవారం సర్పంచ్ తోట వేదాంతి అధ్యక్షతన పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులు ప్రజలతో చర్చించారు. సమస్యల పరిష్కారంలో గ్రామాభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో భాస్కర్‌రావు, డీటీ చంద్రశేఖర్, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు మ్యాక వినోద్, లింగాల నర్సయ్య, ద్యావ సంజీవ్, ద్యావ శ్రీనివాస్, రఘు, మోహన్, రమేశ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కవిత

రామడుగు: బాల్య వివాహాలను అరికట్టాలని ఎంపీపీ కవిత అన్నారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం చైల్డ్‌మ్యారేజ్ మండల కమిటీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. చిన్నపిల్లలకు వివాహాలు చేస్తే చట్టప్రకారం చర్యలుచేపట్టాలని, ఎవరైనా అలా చేస్తే కమిటీ ఆధ్వర్యంలో కఠినచర్యలుతీసుకుంటామని హెచ్చరించారు. బుడిగ జంగాల కాలనీలో ఎక్కువగా బాల్యవివాహాలు జరుగుతున్నాయని సమాచారం అందడంతో కాలనీపెద్దలను పిలిచి బాల్యవివాహాలు చేస్తే కలిగే అనర్థాలను వివరించారు. సమావేశంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, సీడీపీవో కస్తూరి, ఎస్సై అంజయ్య, వైద్యాధికారి రమేశ్, ఏపీఎం ప్రభాకర్, సూపర్‌వైజర్లు జయప్రద, సుధారాణి, రామస్వామి, తిరుపతి, కవిత పాల్గొన్నారు

ఆలయానికి విరాళం



ఆర్థికసాయం అందిస్తున్న మల్లయ్య దంపతులు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి శ్రీరేణుకా ఎల్లమ్మతల్లి ఆలయాభివృద్ధికి గ్రామానికి చెందిన బట్టు లక్ష్మి–మల్లయ్య దంపతులు రూ.10వేలు విరాళం అందించారు. శుక్రవారం ఆలయం ముందు గౌడసంఘం నాయకుల సమక్షంలో అధ్యక్షుడు తాల్లపల్లి సంపత్‌కుమార్‌కు నగదును అందించారు. విరాళాలు సింహద్వారంపై విగ్రహాల ఏర్పాటుకు తోడ్పడతాయని తెలిపారు. గౌడసంఘం డైరెక్టర్లు కెక్కెర్ల సంజీవ్, బొమ్మగాని రాజు, వెంకటేశ్వర్లు, టి.రవీందర్, బి.సత్తయ్య, టి.వెంకన్న, కె.రాములు, కె.శ్రీనివాస్, బి.సంపత్, కె.లక్ష్మణ్, కె.సమ్మయ్య, ఎం.లక్ష్మణ్ ఉన్నారు.

అనాథ బాలికలకు ఆర్థికసాయం

తిమ్మాపూర్: మండలకేంద్రానికి చెందిన బొర్ర రమ అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పోలు రాము శుక్రవారం పరామర్శించారు. రమ ఇద్దరు కూతుళ్లతో మాట్లాడారు. వీరితండ్రి కూడా కొన్నేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతిచెందాడని తెలిపారు. తల్లి మరణంతో ఇద్దరు అమ్మాయిలు అ నాథలయ్యారు. వారికి తక్షణ సాయంగా కొంత నగదు అందించి వారి చదువులకయ్యే పూర్తి ఖర్చు భరిస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో ఎలాంటి సాయం కావాలన్నా సంప్రదించాలని సూచించారు. దాతలు సాయం అందించాలని కోరారు.

పాడితోనే అదనపు ఆదాయం

చిగురుమామిడి: మండల రైతులు ప్రధానంగావ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయంతో పాటు పాడిరంగం ఎంచుకుని అదనపు ఆదాయం పొందుతున్నారు. ప్రతీ పదిహేను రోజులకోసారి వచ్చే పాలబిల్లుతో రైతులు కుటుంబ అవసరాలు, పిల్లలచదువులు, నెలవారి చిట్టీలు చెల్లిస్తున్నారు. చిగురుమామిడి మండలంలో 17 జీపీలు, 5 ఆవ్లేట్ గ్రామాలున్నాయి. 22 గ్రామాల్లో కరీంనగర్ పాలడెయిరీలున్నాయి. గ్రామానికి ఒకటి చొప్పున ఒక పాల ఉత్పత్తి సహకార సంఘాలున్నాయి.

- వ్యవసాయమే ప్రధాన వృత్తిగా రైతులు
- ప్రతీ 15 రోజులకోసారి పాలబిల్లుతో తీరుతున్న కుటుంబ అవసరాలు
- సంక్షేమ పథకాలతో చేకూరుతున్న లబ్ధి
- 22 పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల ద్వారా 7వేల లీటర్ల పాలఉత్పత్తి



సుందరగిరిలోని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘ భవనంలో పాలుపోస్తున్న పాడిరైతులు

డెయిరీ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు

- యువతుల పెళ్లి కానుకగా రూ.ఐదు వేల విలువైన పుస్తె, మెట్టెలు పంపిణీ
- 9వ తరగతి నుంచి ఇంటర్ చదివే పిల్లలకు సంవత్సరానికి రూ.1200 చొప్పున డెయిరీ నుంచి ఉపకార వేతనాలు అందిస్తున్నారు.
- పాల ఉత్పత్తిదారులు ప్రమాదవశాత్తుగాని, సహజ మరణం పొందిన రూ.50వేల బీమా సౌకర్యం కల్పించారు. అలాగే పాడి పశువులకు సైతం బీమా సౌకర్యాన్ని డెయిరీ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టారు.
- సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేయడంతో పాటు పశువులకు దాణా మిశ్రమాన్ని అందిస్తున్నారు.
- చిన్న లేగదూడలకు సైతం వందశాతం సబ్సిడీపై దాణా పంపిణీకి శ్రీకారం చుట్టారు.
- వీటితో పాటు కంప్యూటరైజ్డ్ మిషన్లు, భవనాలు, ఆన్‌లైన్ బిల్లుల చెల్లింపులు ప్రవేశపెట్టడంతో రైతులు ఆకర్షితులై లబ్ధిపొందుతున్నారు. పాడి రైతులకు కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడంతో రైతులు మిగతా డెయిరీలకు వెళ్లకుండా ఈ డెయిరీల్లోనే కొనసాగుతున్నారు.

వ్యవసాయంతో ఆరునెలల కోసారి ఆదాయం

చిగురుమామిడి మండల రైతులు పంటలు సాగుచేసిన ఆరునెలల తర్వాత ఆదాయం వస్తుండడంతో పంట సాగుకు తెచ్చిన అప్పులు, పంటలకు అయ్యే ఖర్చులు పోను ఆదాయం సరిపడక మరో మార్గాన్ని ఎంచుకున్నారు. అదే పాడిపరిశ్రమ, ఈ పాడి పరిశ్రమతో ప్రతి రైతు ఆర్థికపుష్టిని సాధిస్తున్నాడు. ఇందులో భాగంగా ప్రతి రైతు రెండు నుంచి మూడు పాడిపశువులను పోషిస్తున్నాడు. ఉదయం, సాయంత్రం వేళల్లో దాదాపు 10 లీటర్ల నుంచి 20లీటర్ల పాలను పాల ఉత్పత్తి సహకార సంఘంలో పోస్తూ మరింత ఆదాయం పొందుతున్నారు.

ప్రతీరోజు 7వేల లీటర్ల పాల ఉత్పత్తి

మండలంలోని 17 గ్రామపంచాయతీలు, 5 ఆవ్లేట్ గ్రామాలతో కలిపి 22 గ్రామాల్లోని పాలఉత్పత్తి సహకార సంఘాల నుంచి ప్రతీరోజు ఉదయం, సాయంత్రం కలిపి దాదాపు 7వేలలీటర్ల పాలఉత్పత్తి అవుతోంది. ఈ 22 గ్రామాల్లో ఐదు గ్రామాలకు చెందిన 2,500 లీటర్ల పాలు హుస్నాబాద్ పాలశీతలీకరణ కేంద్రానికి తరలిస్తుండగా మిగిలిన 17 గ్రామాల పాలు 4,500 లీటర్లు సుందరగిరిలోని బల్కుమిల్క్ కూలింగ్ యూనిట్‌కు తరలిస్తున్నారు.

అదనపు ఆదాయంతో సర్దుబాటు

రైతులు పాడిపరిశ్రమతో చాలావరకు ఆదాయం పొందుతున్నారు. పాడి పరిశ్రమను నమ్ముకున్న ప్రతీ రైతు నెలలో 15 రోజులకోసారి పాల ఉత్పత్తిపై ఆదాయం పొందుతున్నారు. కనీసం 15 రోజులకోసారి రూ.5 నుంచి రూ. 20వేల వరకు ఆదాయం పొందుతున్నాడు.

ప్రతీ రోజు 600 లీటర్ల పాలు పంపిస్తున్నాం



చిగురుమామిడి పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం నుంచి ఉదయం సాయంత్రం వేళల్లో కలిపి దాదాపు 600 లీటర్ల పాల ఉత్పత్తి అవుతోంది. ఈ పాలను సుందరగిరిలో బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్‌కు తరలిస్తున్నాం. 350 మంది రైతులకు 15 రోజులకు ఒకసారి రూ.3.50 లక్షల బిల్లులు అందిస్తున్నాం.

– పన్యాల శ్రీధర్‌రెడ్డి అధ్యక్షుడు, పాల ఉత్పత్తి దారుల సంఘం, చిగురుమామిడి

రూ. 8లక్షల బిల్లులు చెల్లిస్తున్నాం



సుందరగిరి గ్రామంలో ప్రతీరోజు 2వేల లీటర్ల పాల ఉత్పత్తి అవుతోంది. దాదాపు 500 మంది రైతులు పాలు పోస్తున్నారు. వీరికి ప్రతి 15 రోజులకోసారి దాదాపు రూ.8లక్షల బిల్లులు చెల్లిస్తున్నాం. కరీంనగర్ డెయిరీ నుంచి సంక్షేమ పథకాలను రైతులకు అందిస్తున్నాం. పాడి పశువులకు సబ్సిడీపై మినరల్‌మిక్చర్ ప్యాకెట్లు, కాల్షియం వంటివి అందిస్తున్నాం.

– తాళ్లపల్లి సంపత్‌కుమార్, అధ్యక్షుడు, పాల ఉత్పత్తి దారుల సంఘం, సుందరగిరి

రైతుల సంక్షేమమే ధ్యేయం



సుందరగిరి బల్క్‌మిల్క్ కూలింగ్ యూనిట్ పరిధిలోని 17 పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల సెంటర్లలో పాల ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. డెయిరీ నుంచి వచ్చే సంక్షేమ పథకాలు ప్రతీ రైతుకు అందేలా చూస్తున్నాం. పాలబిల్లుల పంపిణీపై పర్యవేక్షిస్తున్నాం. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలకు పాడిపశువులు కొనుగోలుకు రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సుందరగిరి సంఘానికి వారంలో 60 పాడి ఆవులు వస్తున్నాయి.

– అప్పాల మల్లయ్య, సూపర్‌వైజర్, బల్క్‌మిల్క్ కూలింగ్‌యూనిట్, సుందరగిరి



తాటిచెట్టు ఎక్కి మొక్కులు చెల్లిస్తున్న గౌడ్స్

ఘనంగా నాగవెల్లి పండుగ

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మతల్లి పట్నాల వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గీత కార్మికులు తాటిచెట్టు ఎక్కి ముంజలు కోసి ఎల్లమ్మ తల్లికి పూజలు చేశారు. బైండ్ల పూజారులు ప్రత్యేక పూజలు చేసి ఎల్లమ్మతల్లి కథ వినిపించారు.

దొంగిలించిన ఫోన్ రికవరీ



ఫోన్‌ను అందిస్తున్న పోలీసులు

చొప్పదండి: పట్టణానికి చెందిన చీకటి కుమార స్వామి సుమారు రూ.30వేల విలువైన ఫోన్‌ను మడేలయ్య ఉత్సవాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేయడంతో పోలీసులను సంప్రదించగా సాంకేతిక పరిజ్ఞానంతో రికవరీ చేశారు. ఈమేరకు సీఐ రవీందర్, ఎస్సై ఉపేంద్రచారి శుక్రవారం ఫోన్‌ను స్వామికి అందించారు. పోలీసు బృందాల ద్వారా దొంగిలించిన సెల్‌ఫోన్‌లను రికవరీచేయిస్తున్నట్లు తెలిపారు.

జాతీయ ఉత్తమ రైతుకు సన్మానం



అవార్డు స్వీకరిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి

చొప్పదండి: జాతీయ ఉత్తమ రైతు అవార్డుగ్రహీత మావురం మల్లికార్జున్‌రెడ్డిని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ శుక్రవారం సన్మానించారు. జమ్మికుంట కృషి విజ్ఞానకేంద్రంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను గుర్తించి సన్మానించగా చొప్పదండి మండలం పెద్దకూర్మపల్లికి చెందిన మల్లికార్జున్ రెడ్డి ఉత్తమ రైతు అవార్డుగ్రహీతగా ఎంపికయ్యారు. తనకు అవకాశం కల్పించిన అధికారులకు మల్లికార్జున్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామపంచాయతీ ఉద్యోగుల సమ్మె నోటీసు

మానకొండూర్: గ్రామపంచాయతీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మెచేస్తామని గ్రామపంచాయతీ ఉద్యోగులు మానకొండూర్ ఎంపీడీవో దివ్యదర్శన్‌రావుకు శుక్రవారం సమ్మె నోటీసు అందించారు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కారోబార్, బిల్‌కలెక్టర్లను మల్టీపర్పస్ విధానం నుంచి మినహాయించాలని, పంచాయతీ కార్యదర్శికి అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. సఫాయి, ఎలక్ట్రీషియన్, పంప్ ఆపరేటర్, ట్రాక్టర్ డ్రైవర్ అందరి సమస్యలు పరిష్కరించేంత వరకూ విధుల్లో చేరమని, సమ్మెలో ఉంటామని నోటీసులు అందించారు.

ఐలమ్మ స్ఫూర్తితో ఉద్యమించాలి

కరీంనగర్‌రూరల్: సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో రజక మహిళలు హక్కుల కోసం పోరాడాలని తెలంగాణ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్‌కుమార్ అన్నారు. శుక్రవారం తీగలగుట్టపల్లి సరస్వతీనగర్‌లో జరిగిన రజక సంఘం మహిళా విభాగం జిల్లా సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రజక కార్పొరేషన్‌కు పాలకవర్గం ఏర్పాటు చేసి రుణాలు మంజూరు చేయాలన్నారు. బ్యాంకులతో సంబంధం లేకుండా మహిళలకు రూ.2లక్షల రుణాలివ్వాలని కోరారు. జూన్‌లో సభ నిర్వహిస్తున్నామన్నారు.

వారం రోజుల్లో ఐసీయూ సేవలు

- హుజూరాబాద్ ప్రాంతీయ ఆసుపత్రిలో అందుబాటులోకి..
- ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి



వార్డులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా హుజూరాబాద్ ప్రాంతీయ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలందుతున్నాయని, వారం రోజుల్లో ఐసీయూ సేవలు కూడా అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ పాడికౌశిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. వివిధ విభాగాల వార్డులను పరిశీలించారు. వైద్య సేవల తీరుపై రోగులను ఆరాతీశారు. వైద్యాధికారులు, సిబ్బందితో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు సీఎం కేసీఆర్, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావుల ఆదేశాలమేరకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లుచెప్పారు. హుజూరాబాద్ ఆసుపత్రిలో ఐసీయూ సెంటర్‌ను త్వరలోనే ప్రారంభిస్తామని పేర్కొన్నారు మరో ఐదు డయాలసిస్ యూనిట్లు మంజూరయ్యాయని, వాటిని కూడా త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడతామన్నారు. జిల్లా వైద్యాధికారి లలితాదేవి, ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి, ఆర్‌ఎంవో సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నవోదయ విద్యార్థుల ప్రతిభ



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మంగతాయారు

చొప్పదండి: జవహర్ నవోదయ విద్యాలయానికి చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చారు. నెహ్రూ యువకేంద్రంచే గుర్తింపు పొందిన డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ, ఫైన్‌ఆర్ట్స్ ఫౌండేషన్ ట్రస్టు విజయవాడ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో పదో యూత్, చిల్డ్రన్స్ చిత్రలేఖన పోటీలు నిర్వహించారు ఈ సందర్భంగా నవోదయ విద్యాలయం నుంచి హాజరైన విద్యార్థులు ఆల్ ఇండియా బాల చిత్రకళ అవార్డు, పది గోల్డ్‌మెడల్స్, మూడు సిల్వర్‌మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ టీచర్ గోకా నాగేశ్వర్‌రావును, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ మంగతాయారు అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



మార్కెట్ యార్డు సందర్శించిన అదనపు కలెక్టర్

చొప్పదండి: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ అధికారులను ఆదేశించారు. మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, ధాన్యం కుప్పలను శుక్రవారం అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. తేమశాతం నిబంధనల మేరకు ఉన్న ధాన్యం కుప్పలను తూకం వేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంబటి రజిత, పీఏసీఎస్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ చీకట్ల రాజశేఖర్, ఏనుగు స్వామిరెడ్డి, గాండ్ల లక్ష్మణ్, రాజమల్లయ్య, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న సర్పంచ్ వీర్ల సరోజన

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామపరిధిలోని కిష్టారావుపల్లి, వన్నారం, మోతె, గోలిరామయ్యపల్లి గ్రామాల్లో శుక్రవారం రామడుగు, కొక్కెరకుంట సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ కవిత, సర్పంచ్ వీర్ల సరోజన ప్రారంభించారు. కొక్కెరకుంట సింగిల్‌విండోచైర్మన్ ఒంటెల మురళీకృష్ణారెడ్డి, ఆల్గీచైర్మన్ ఉప్పుల అంజనీప్రసాద్, ఎంపీటీసీ హరీశ్, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, ఉపసర్పంచ్ పూదరి వెంకటేశ్, జిల్లా రైతుబంధు కమిటీ సభ్యులు సంజీవరావు, మల్లయ్య, లచ్చయ్య పాల్గొన్నారు.

నేలరాలిన మామిడి, ధ్వంసమైన తోటల పరిశీలన



చిగురుమామిడిలో పరిశీలిస్తున్న అధికారులు

చిగురుమామిడి: అకాల వర్షాలు, ఈదురు గాలులకునేలరాలిన మామిడి కాయలను, ధ్వంసమైన తోటలను మండలంలోని సుందరగిరిలో జిల్లా సాంఘీక సంక్షేమశాఖ డీడీ, మండల ప్రత్యేకాధికారి నతానీయల్ పరిశీలించారు. శుక్రవారం మండల వ్యవసాయాధికారితో కలిసి పలుగ్రామాల్లో పర్యటించి మాట్లాడారు. అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులు అధైర్యపడొద్దన్నారు. తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఆయన వెంట సర్పంచ్ శ్రీమూర్తి రమేశ్, ఏఈవో శ్రీనివాస్, పలువురు రైతులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



వన్నారంలో పంటనష్టం పరిశీలిస్తున్న ప్రియదర్శిని

పంట నష్టం సర్వేచేపట్టాలి

రామడుగు: మండలంలోని ప్రతీగ్రామంలో రైతులకు చెందిన పంటలను సర్వేచేసి పంటనష్టం అంచనా వివరాలను సమగ్ర సర్వేచేసి నివేదిక అందించాలని మండల ప్రత్యేకాధికారి ప్రియదర్శిని సూచించారు. రామడుగు మండలంలోని వన్నారం గ్రామంలో శుక్రవారం వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వివరాలు సేకరించారు. రైతులు వ్యవసాయాధికారులకు సరైన సమాచారం అందించి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫేర్‌వెల్ డే

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫేర్‌వెల్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ విద్యార్థులకు ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించి వారితో గల స్నేహానుబంధాలను పంచుకున్నారు అనంతరం ప్రిన్సిపాల్‌లక్ష్మినరసింహామూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని నేటి పోటీ ప్రపంచంలో అన్నిరంగాల్లో పోటీపడుతూ నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. మంచి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తేవాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ – కల్చరల్ కో ఆర్డినేటర్ ఎస్.మధు, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డా.పి.దినకర్, అకాడమిక్ కో ఆర్డినేటర్ డా.జి.శ్రీనివాస్, ఉపన్యాసకులు ఎస్. ఉదయశ్రీ, డా.చారి, ఎన్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్ పి.హరిప్రసాద్, సమ్మయ్య, రాజకుమార్, స్టాఫ్‌సెక్రటరీ రమేశ్, డా.స్వప్న, స్వరూప, బోధనేతర సిబ్బంది పాషా, రాజ్ కుమార్, రమేశ్, శ్రీలత, స్పందన తదితరులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలు సరికాదు

హుజూరాబాద్: ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ఇటీవల హుజూరాబాద్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభలో చేసిన వ్యాఖ్యలు సరికాదని బీఎస్పీ రాష్ట్ర కన్వీనర్ అకినపల్లి శిరీష అన్నారు. శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆయన మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శులు మారపల్లి మొగిలయ్య, నాయకులు దొడ్డె శ్రీనివాస్, బండారు సదానందం, మంద సమ్మయ్య, రాం శ్రీనివాస్, మహేందర్, రమేశ్, కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల జోలికి వస్తే సహించం

ఇల్లందకుంట: కాంగ్రెస్ కార్యకర్తల జోలికి వస్తే సహించేదిలేదని మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామారావు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఇటీవల హుజూరాబాద్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభలో ప్రభుత్వవిప్, శాసనమండలి సభ్యుడు పాడి కౌశిక్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు కనుమల సంపత్, శనిగరపు రాము, గోడిశాల పరమేశ్, గుండారపు సాయికుమార్, ఎడ్ల కిషన్‌రెడ్డి, బోగం సాయి, రావుల వెంకటేశ్, పైడిపెల్లి దేవేందర్‌రాజు, ఎన్‌ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భగవాన్‌రెడ్డి, నాయకులు

జమ్మికుంట: కాంగ్రెస్ పార్టీ, కార్యకర్తలపై అనుచిత వాఖ్యలు చేస్తే సహించబోమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌లను టీపీసీసీ సభ్యుడు కర్ర భగవాన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సొల్లు బాబులు హెచ్చరించారు. శుక్రవారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో హుజూరాబాద్ నియోజకవర్గం 5 మండలాల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం కొత్తపల్లి చౌరస్తా వద్ద ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ల దిష్టిబొమ్మలు దహనం చేశారు.

పంచాయతీ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలో పలు గ్రామాల్లో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం నుంచి సమ్మెలో పాల్గొంటుండటంతో వారి స్థానంలో విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఎంపీడీవో ఏ.శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. కొత్తపల్లి మండలంలో 8 గ్రామ పంచాయతీలుండగా మల్కాపూర్, బద్దిపల్లి, కమాన్‌పూర్ గ్రామాల్లో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు సమ్మెకు వెళ్లడంతో బద్దిపల్లికి నాగులమల్యాల కార్యదర్శి డి.సుష్మిత, కమాన్‌పూర్‌కు ఆసిఫ్‌నగర్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, మల్కాపూర్‌కు చింతకుంట కార్యదర్శి జి.లచ్చయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు.